క్లుప్తంగా

భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని



బనగానపల్లె : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఫోర్స్‌లైన్‌లో భగీరథ ఉప్పరసేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ భగీరథ మహర్షి విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, భగీరథ ఉప్పరి సేవా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు సురేష్‌కుమార్, పోలూరు వెంకట సుబ్బయ్య, చిందుకూరు సుబ్రమణ్యం,గోపాల్, శంకర్, వెంకటరాముడు, కృష్ణ పాల్గొన్నారు.

వెంకటరెడ్డి తిరునాల ప్రారంభం

ప్యాపిలి: పట్టణంలోని స్థానిక వెంకటరెడ్డి కాలనీలో వెలసిన అవధూత శ్రీవెంకటరెడ్డి తిరునాల వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. గ్రామ సుభిక్షం కోసం పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. తిరునాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున దుకాణాలు వెలిశాయి. దుకాణాలు, బ్రేక్‌డ్యాన్స్, జెయింట్‌వీల్ వద్ద పిల్లల కోలాహలం నెలకొంది. ఆదివారం తేరు లాగడంతో తిరునాల వేడుకలు ముగుస్తాయి.

సరోజినీ నాయుడిని ఆదర్శంగా తీసుకోవాలి



సరోజినీనాయుడి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : స్వాతంత్య్ర సమరయోధురాలు సరోజినీనాయుడుని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఎదగాలని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వసుంధరదేవి, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ అన్నారు. సరోజీ నాయుడు వర్ధంతిని పురస్కరించుకొని శనివారం స్కూల్లో ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సరోజీనినాయుడి త్యాగాలను వారు విద్యార్థులకు వివరించారు.

పరామర్శ



వెంకటరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె రూరల్ : బనగానపల్లెలోని భానుముక్కలకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వెంకటరెడ్డికి అనారోగ్యానికి గురవ్వడంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. వెంకటరెడ్డితో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరోగ్య వివరాలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కాపులపల్లె మహేష్, హాజీహుస్సేన్, సాబ్జాన్‌అలి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించిన నేపథ్యంలో జనవరి 26న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న స్థానిక ప్రభుత్వ వైద్యశాల సూపరిడెంట్ డాక్టర్ మహ్మద్ హనీఫ్, గైనకాలజిస్ట్ డాక్టర్ అనురాధను డోన్ తాలూక వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు, సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. వారికి వైద్యులు, నర్సులు తదితరులు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరం

డోన్ రూరల్ : మండల పరిధిలోని చిన్నమల్కాపురంలో శనివారం కామినేని అసుపత్రి సహకారంతో వెంకటసుబ్బమ్మ ఐరన్‌టర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌లు రోగులను పరిశీలించి అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త డి.క్రిష్టారెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణంలోని ఇండస్ట్రియల్ సబ్ స్టేషన్, వాటర్ వర్క్స్, కన్నపకుంట ఫీడర్‌లలో 11 కేవీ పనుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బేతంచెర్ల రోడ్డులోని ఫ్యాక్టరీలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంటు ఉండదన్నారు. కన్నపకుంట గ్రామ ఫీడర్ కింద వ్యవసాయానికి తెల్లవారు జామున 5 నుండి 10గంటల వరకు, సాయంత్రం 5గంటల తరువాత కరెంట్ సరఫరా చేస్తామని ఏఈ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం

- పట్టణాలకు దీటుగా పల్లెలను తీర్చిదిద్దాం
- ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాం
- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ రూరల్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యనిస్తుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పట్టణాలతో సమానంగా పల్లెలను సైతం తీర్చిదిద్దుతున్నామని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించామని మంత్రి స్పష్టం చేశారు. మండల పరిధిలోని తాటిమాన్‌కొత్తూరు, వలసల గ్రామాలలో నిర్మించిన రోడ్లను శనివారం మంత్రి ప్రారంభించారు. అంతకుముందు మంత్రి ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రికి మహిళలు హారతులుచ్చి స్వాగతించారు. రూ.90లక్షలతో డోన్ 44వ జాతీయ రహదారి నుంచి తాటిమాన్‌కొత్తూరుకు, రూ.2.01కోట్లతో చిన్నమల్కాపురం నుంచి వలసల గ్రామం వరకు సిమెంట్ రోడ్డును ప్రారంభించిన మంత్రి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. రూ. 2.500 కోట్లతో డోన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేశామని, పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ పూర్తిస్థాయిలో ప్రజలకు వసతులు కల్పించామని చెప్పారు. వైద్య, విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధానిస్తూ పల్లెల రూపురేఖలు మార్చేశామన్నారు. గతంలో టీడీపీ నేతలు డోన్‌కు చేసిందేమీ లేదని, కనీస మౌలిక వసతులు కల్పించలేదని ఎద్దేవా చేశారు. ఒకప్పటి డోన్ పరిస్థితి... ఇప్పుడు జరిగిన అభివృద్ధిని ప్రతిఒక్కరూ గమనించాలని, ప్రభుత్వం చేసిన సాయాన్ని గుర్తించాలని కోరారు. పల్లెలు సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ తదితర ప్రభుత్వ భవనాలతో కళకళలాడుతున్నాయన్నారు. మండల కేంద్రాలకు వెళ్లకుండానే ప్రతి సమస్య ఉన్న గ్రామంలోనే పరిష్కారం అవుతుందని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా మంత్రి ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, పారిశ్రామిక వేత్త కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, సర్పంచ్ ప్రసన్నలక్ష్మి, నాయకులు హనుమంత్‌రెడ్డి, బద్దల నాగరాజ్, రాముడు, మద్దయ్య, దాస్ తదితరులు పాల్గొన్నారు.



వలసల గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

డోన్ నియోజకర్గ ప్రజల తాగునీటి సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపుతున్నామని మంత్రి బుగ్గన స్పష్టం చేశారు. రూ. 351 కోట్లతో వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి బేతంచెర్ల, డోన్, ప్యాపిలి మండలాలకు నీటి సరఫరా చేయబోతున్నామన్నారు. గతంలో ప్రజలు పడిని ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య తలెత్తకుండా శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొలిమిగుండ్ల: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి శనివారం తెలిపారు. ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు ప్రారంభమవుతుందని, ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రేపటి నుంచి విగ్రహాల ప్రతిష్టోత్సవాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం సిద్దరామేశ్వరస్వామి ఆలయం జీర్ణోద్ధరణ సందర్భంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహా ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పూజల అనంతరం చివరి రోజు బుధవారం సిద్దివినాయక, పర్వత వర్ధిని, గంగాదేవి, నవగ్రహా, నందీశ్వర, కలశ, ధ్వజ స్తంభ ప్రతిష్ట జరుగు తుందన్నారు. బెలుం శింగవరం, యర్రగుంట్ల, రామాపురం గ్రామాలకు చెందిన బృందాలతో చెక్క భజన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోవెలకుంట్ల: నంద్యాల స్పెషల్ స్కాడ్, స్థానిక సెబ్ అధికారులు కోవెలకుంట్ల మండలంలో శనివారం బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించారు. పట్టణంలోని జమ్మలమడుగు చౌరస్తా సమీపంలో జాఫర్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా 32 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ వర్ధనాదేవి తెలిపారు. అలాగే రేవనూరు సమీపంలో నవీన్‌గౌడ్ మద్యం బాటిళ్లు అమ్ముతుండగా 26 మద్యం బాటిళ్లు సీజ్ చేశామన్నారు. విక్రేతలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా మేజిస్టేట్ రిమాండ్‌కు ఆదేశించిన ట్లు సీఐ వివరించారు.

నాడు నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

సంజామల: మండలంలో పాఠశాలలో జరిగే నాడు నేడు పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలిత కుమారి అన్నారు. మండల కేంద్రం సంజామల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగకుమార్ ఆధ్వర్యంలో శనివారం సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అదనపు తరగతి గదులు, బాత్‌రూమ్‌లు, ప్రహరీ పనులు తర్వగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ మానిటరింగ్ ఆఫీసర్ బాషా, ఎంఈఓ ఈశ్వరయ్య, మండల పంచాయితీ రాజ్ ఏఈ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను సకాలంలో చెల్లించండి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

డోన్: పట్టణాభివృద్ధికి ప్రజలు ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించడం ద్వారా మౌలిక వసతుల కల్పనకు ఉపయోగపడుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. 22వ వార్డు పరిధిలోని వైఎస్ నగర్ కాలనీల్లో శనివారం సచివాలయ అధికారులు, కౌన్సిలర్ శరత్‌బాబుతో కలిసి ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న సమస్యల గురించి ఆయన స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య పనుల వివరాలు, మంచినీటి సరఫరా విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, డీఈ రసూల్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

డోన్ టౌన్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం అని డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. గతనెల రెండవ త్రైమాసికం లక్కీ డిప్ స్కీంకు సంబంధించి శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజల సమక్షంలో డిప్ తీసి విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే వారిని పోత్సహించేందుకు లక్కీ డిప్ స్కీంకు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. నెలలో రెండు సార్లు డిప్ తీసి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నామని చెప్పారు. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా డోన్‌కు చెందిన నాగలక్ష్మీ, వెల్దుర్తికి చెందిన అల్లా బకాష్, డోన్‌కు చెందిన శకుంతలను వరించాయన్నారు.



లక్కీ డిప్ తీస్తున్న అధికారులు

ప్రశాంత ఎన్నికకు సహకరించాలి

కోవెలకుంట్ల: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర సూచించారు. ఎన్నికల నేపథ్యంలో శనివారం రాత్రి మండలంలోని పొట్టిపాడు గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా ప్రవర్తిస్తే ఎటువంటి వ్యక్తులనైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే పోలీసుల దృష్టికి తీసుకరావాలని పేర్కొన్నారు. మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఎప్పటి కప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వరప్రసాద్, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కోవెలకుంట్ల సీఐ జయచంద్ర

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

బేతంచెర్ల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలవాలని సీఐ ప్రీతం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ముద్దవరంలో సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిమ్మయ్య, ఎంపీటీసీ మధు, హెడ్ కానిస్టేబుల్ తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

బనగానపల్లె రూరల్ : త్వరలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు కఠిన చర్యలు తప్పవని నందివర్గం పోలీసు స్టేషన్ ఎస్ఐ తిరుపాల్ హెచ్చరించారు. శనివారం రాత్రి మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన రామకృష్ణాపురంలో ఎస్ఐ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో పాతనేరస్తులు, రౌడి షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

యాగంటి ఉత్సవాలకు పాణ్యం ఎమ్మెల్యేకు ఆహ్వానం



కాటసాని రాంభూపాల్‌రెడ్డికి బుక్‌లెట్‌ను అందజేసిన ఆలయ ఈఓ, చైర్మన్‌లు

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి కల్యాణ, వసంతోత్సవ, తెప్పోత్సవాలు ఈ నెల 7 నుంచి ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. జిల్లా కేంద్రం కర్నూలులోని స్వగృంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి శనివారం ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన బుక్‌లెట్‌ను ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని నరసింహారెడ్డి, అర్చకుడు మహేష్ తదితర అర్చకులు ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు జరిగిన మంచిని వివరించాలి

బనగానపల్లె రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి జరిగిన మంచిని వలంటీర్లు ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని పలుకూరు గ్రామ సచివాలయంలో సర్పంచ్ కోనేటి సుమలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వలంటీర్ల సమావేశంలో గుండం శేషిరెడ్డి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని ప్రతికుటుంబానికి పార్టీలకు అతీతంగా లబ్ధి చేకూరిందన్నారు. ప్రజల వద్దకు పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించిలే ప్రజలను చైతన్య పరచాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పుల్లారెడ్డి, ఎంఎల్ఓ మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుండంశేషిరెడ్డి

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

డోన్ : పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో గత రెండేళ్లలో శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణాలకు రూ. రూ.10కోట్లు ఖర్చు చేశామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. అదేవిధంగా తారకరామ నగర్ నుంచి కోర్టు రోడ్డును అనుసంధానం చేస్తూ నూతన రహదారి నిర్మాణం కోసం రూ.80లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ మేరకు శుక్రవారం ఈ రహదారి పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. గోరుకల్లు రిజర్వాయరు నుంచి శుద్ధ జలాన్ని డోన్ ప్యాపిలి మండల ప్రజలకు తర్వరలో సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు రైల్వే నాగేంద్ర, కటికె వేణు, ఆర్ట్ రమణ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, నాయకులు మిట్టా రవికుమార్, ఆర్ఈ రాజవర్ధన్, డీఈ రసూల్, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి పల్స్‌పోలియో

కోవెలకుంట్ల: సున్న నుంచి ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులకు పోలియో సోకకుండా ఆదివారం నుంచి పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు విద్యాసాగర్, రాబర్ట్‌కెన్నేడి తెలిపారు. శనివారం రేవనూరులో పల్స్‌పోలియోపై ర్యాలీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 18 పోలియో కేంద్రాలు, ఒక మోబైల్ కేంద్రం ద్వారా 3,300 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. అలాగే కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో 12 పోలియోకేంద్రాలు, ఒక మోబైల్, ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల ద్వారా 2,600 మంది చిన్నారులు పోలియో చుక్కలు వేస్తారన్నారు. మొదటి రోజు పోలియో కేంద్రాల్లో సోమ, మంగళవారాల్లో ఇంటింటికి తిరిగి మిగిలిపోయిన చిన్నారులు పోలియో చుక్కలు వేస్తారని పేర్కొన్నారు.

బనగానపల్లె రూరల్ : మండలంలో ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీ,విద్యార్థులతో కలిసి పట్టణంలోని ప్రధాన కాలనీల్లో పల్స్ పోలియోపై ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, వైద్యసిబ్బంది

కొలిమిగుండ్ల: ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని కొలిమిగుండ్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హరిచరణ్‌రెడ్డి సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం సిబ్బంది,ఆశాకార్యకర్తలతో కలిసి పీహెచ్‌సీ నుంచి గ్రామంలో వీధుల గుండా ర్యాలీ చేపట్టారు.

సంజామల:మండల కేంద్రం సంజామలతో పాటు వివిధ గ్రామాలో జరిగే పోలియో పల్స్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నాగకుమార్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి విద్యార్థలతో కలసి వైద్యసిబ్బంది పాత పోలీస్ స్టేషన్ వరుకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లడుతూ అప్పుడే పుట్టిన బిడ్డనుంచి ఐదు సంవత్సరాల వరుకు శిశువులకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. ర్యాలీలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫిసర్ క్రిష్ణకుమారి, వైద్య సిబ్బంది నారయణదాసు, పురుసోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి బుగ్గన



బేతంచెర్ల నుంచి వెల్దురి మండలంకు వేసిన డబుల్ రోడ్డు



వీరాయపల్లె గ్రామ రహదారి



మద్దికుంట గ్రామానికి వేసిన రహదారి

బేతంచెర్ల: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదివారం పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. మండల కేంద్రం బేతంచెర్ల పట్టణం నుంచి కొలుములపల్లె, ముద్దవరం, ఎం, పేండేకల్లు గ్రామం మీదుగా వెల్దుర్తి మండలం రామళ్ల కోట వరకు రూ. 42 కోట్లతో 23 కిలోమీటర్ల డబుల్ రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అదేవిధంగా కనుమకింది కొట్టాల – బనగానపల్లె మండలం రామక్రిష్టాపురం వరకు, కనుమకింది కొట్టాల గ్రామం నుంచి బిల్ల స్వర్గం గుహల వరకు వేసిన సుమారు రూ.9.35 కోట్లతో పూర్తతన రహదారులు, వీరాయపల్లె గ్రామానికి రూ. 3 కోట్లతో నిర్మించిన రోడ్డు, మద్దికుంట గ్రామానికి రూ. 75 లక్షలతో పూర్తి చేసిన రహదారులను మంత్రి బుగ్గన ప్రారంభించనున్నారు.

నేడు రహదారులు, ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ

మండలంలోని గూటుపల్లె గ్రామ సమీపాన కొండల్లో వెలసిన పాలుట్ల రంగనాథస్వామి ఆలయానికి ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి లేక పోవడంతో భక్తుల ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి ప్రత్యేక చొరవతో 6 కిలో మీటర్ల రహదారికి రూ. 6.50 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ పనులకు మంత్రి బుగ్గన ఆదివారం భూమి పూజ చేయనున్నారు. అదేవిధంగా వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏపీ టూరిజమ్ శాఖ చేపట్టే అభివృద్ధి పనులకు రూ.6 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ భవన నిర్మాణాలకు మంత్రి భూమి పూజ చేయనున్నారు. హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో రూ. 1.90 కోట్లతో చేపట్టే ఆలయ గాలిగోపురం పునరుద్ధరణ, ఫ్లోరింగ్, కాలక్షేప మండపం, దేవతా కల్యాణ మండపం, తేరు పునురుద్ధరణ మంత్రి బుగ్గన పూజ చేసి పనులకు ప్రారంభిస్తారు.

మూడు ఇళ్లలో చోరీ

డోన్ టౌన్ : పట్టణ శివారులోని సాయినందన్ వెంచర్‌లో శనివారం తెల్లవారు జామున ఇంటికి తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లలో చోరీ జరిగినట్లు కాలనీవాసులు తెలిపారు. విద్యుత్ లైన్‌మెన్ హరిప్రసాద్‌గౌడ్, ఆర్మీ కానిస్టేబుల్ శివరాం, టీచర్ భూకాంతరెడ్డి ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. భూకాంతరెడ్డి ఇంటిలో చోరీ చేసే సమయంలో అలజడి రావడంతో గమనించిన స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నించగా దొంగలు కత్తులు చూపించి పారిపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ మూడిళ్ల కుటుంబ సభ్యులు వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఉదయం క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. లైన్‌మెన్ ఇంటిలో రూ.30వేల నగదు, రెండు జతల కమ్మలు చోరీ అయ్యాయని బాధితుడి బంధువులు తెలిపారు. ఇంట్లో బంగారు, నగదు పోయినట్లు టీచర్ తెలిపారు. కేసు ఇంకా నమోదు చేయలేదని విచారిస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

డోన్ రూరల్ : నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేదలను ఇబ్బందులు పెడుతున్న ప్రధాని మోడీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని నక్కి రామన్న భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటువంటి దారుణమైన ప్రధాన మంత్రిని ఎప్పుడు చూడలేదన్నారు. గ్యాస్ సిలిండర్, నూనె, డీజిల్, పెట్రోల్ ధరలను విపరీతంగా పెంచారన్నారు. సమావేశంలో నాయకులు రంగనాయుడు, పులిశేఖర్, మోటారాముడు, రణత్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలను అరికట్టాలి

డోన్ టౌన్ : పట్టణంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజల్లో అభద్రత భావం నెలకొందని, వీటిని అరికట్టాలని కోరుతూ శనివారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రత్యేకించి పట్టణ శివారు కాలనీల్లో దొంగతనలు జరుగుతున్నాయని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధక్షులు కొత్తకాపు హేమ సుందరరెడ్డి డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు అంజనేయ, రమేష్, ఉమ్మాజీరావ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలపై వడ్డీ మాఫీ

డోన్ టౌన్ : మున్సిపాల్టీకి చెల్లించాల్సిన ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ చేస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జయరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొండి బాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29న జారీ చేసిన జీవో నెంబరు 35 ప్రకారం మార్చి నెలాకరులోపు బకాయి మొత్తాన్ని ఏక కాలంలో చెల్లించిన వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలను వన్‌టైం మేజర్‌గా నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పన్ను త్వరగా చెల్లించాలని సూచించారు.

డాక్యుమెంట్ పోయినది

నా పేరు నాగరాజు ఐ.నెం.: 87/347/02 కమలనగర్, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా. నేను 27/02/2024వ తేదీ బేతంచెర్ల నుండి కర్నూలుకు బస్సులో వస్తుండగా నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ నెం: 2391/1998 సర్వే నెం: 631/బి1 కల్లూరు ఎస్ఆర్ఓ పోయినది. ఎవరికైనా దొరికిన యెడల పైన తెలిపిన అడ్రస్‌కు/ఈ క్రింది నంబరు సంప్రదించగలరు.
నాగరాజు: 95427 08554

కడపకు వెళ్లి పింఛన్ అందజేత

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డి పల్లెకు చెందిన వలంటీర్ శనివారం కడప పట్టణానికి వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందజేశాడు. గ్రామానికి చెందిన పోచంరెడ్డి ఆదినారాయణరెడ్డికి వారం క్రితం పక్షవాతంతో కడపలో వైద్యం చేయించుకుంటున్నాడు. ఆసుపత్రి డిశ్చార్జ్ అయ్యాక కూతురు ఇంట్లో ఫిజియోథెరఫీ చేయించుకుంటున్నాడు. వలంటీర్ సునీల్ అక్కడికి వెళ్లి అతనికి వృద్ధాప్య పింఛన్ రూ.3వేలు అందజేశాడు.



ఆదినారాయణరెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సునీల్

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

డోన్ టౌన్ : బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని హెచ్ఎం పద్మావతి, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. పాతపేట జెడ్పీ హైస్కూల్లో శనివారం హిషన్ వంద శాతం జీఈఆర్ లో భాగంగా పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చదువు ఆవశ్యకత ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
99122 20581 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com